

ఇలా వేద్దామా.. ఎమ్మెల్సీ ఓటు

సార్వత్రిక ఎన్నికల్లో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలంటే ఆయన పేరు ఎదురుగా ఉన్న గుర్తుపై ఓటేస్తే సరిపోతుంది. 8లో



'భవిత'కు వెన్నుదన్నుగా..!

భవిత కేంద్రాలు దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. తల్లిదండ్రుల కంటే మిన్నగా సేవలు అందిస్తున్నాయి. 10లో



పాత గంగవరం తీరం.. వెండితెర మణిహారం

పాత గంగవరం తీరం సినిమా షూటింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. 10లో

న్యూస్‌రీల్

బీచ్ శుభ్రతకు సహకరించండి



సాగర్‌నగర్ బీచ్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కొమ్మాది: సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా బీచ్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతీ ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రభుత్వం యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం సాగర్‌నగర్ బీచ్‌లో స్వచ్ఛత పదో విడత బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే నెలలో జిల్లాలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్, జీ–20 సదస్సులు నిర్వహించనున్న నేపథ్యంలో నగరాన్ని శుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతీ నెలా క్రమం తప్పకుండా బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో అదనపు అంతస్తు ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న సీపీ శ్రీకాంత్

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దివీస్ సహకారంతో నూతనంగా నిర్మించిన అదనపు అంతస్తును పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదివారం ప్రారంభించారు. సామాజిక బాధ్యతగా నూతన కార్యాలయం నిర్మాణానికి సహకరించిన దివీస్ సంస్థకు నగర పోలీసుల తరపున సీపీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, డీసీపీ క్రైమ్స్ జి.నాగన్న, ఇతర పోలీసు అధికారులు, దివీస్ సంస్థ డైరెక్టర్ ప్రాజెక్ట్సు మధుసూదనరావు, జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

స్నేక్ సేవర్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: వన్య ప్రాణులతోపాటు మన చుట్టూ సంచరిస్తున్న జంతువులను సంరక్షించాల్సి బాధ్యత అందరిపై ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్నేక్ సేవర్ సొసైటీ ఆధ్వర్యంలో స్నేక్ సేవర్ వెబ్‌సైట్‌ను మిందిలోని తన నివాసంలో మంత్రి ఆవిష్కరించారు. విష సర్పాల వల్ల ప్రజలకు ఎటువంటి హాని లేకుండా వాటిని సంరక్షిస్తుండంలో సొసైటీ అధ్యక్షుడు రొక్కం కిరణ్‌కుమార్ చూపుతున్న కృషి అభినందనీయమన్నారు.

శిక్షణ పొందిన ప్రతీ విద్యార్థి ఉద్యోగాల్లో స్థిరపడాలి



శ్రీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య

సీతమ్మధార: స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పొందిన ప్రతీ విద్యార్థి ఉద్యోగాల్లో స్థిరపడాలని ప్రభుత్వ సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆయన్ని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించిన నేపథ్యంలో దొండపర్తిలోని ఓ హోటల్లో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం జేఎన్‌టీయూ వీసీ వెంకట సుబ్బయ్య శ్రీధర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. శిక్షణ పొందిన వారంతా ఆయా రంగాల్లో స్థిరపడేలా ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ ప్రెసిడెంట్ సౌత్ ప్రొఫెసర్ ఎస్.సాంబ శివరావు, విశాఖ చాప్టర్ చైర్మన్ ఓ.ఆర్.ఎం.రావు, సెక్రటరీ హేమ యాదవల్లి, ఎస్.సి.మెంబర్స్ ఠాగూర్, అప్పారావు, మురళీ పాల్గొన్నారు.

విప్రో విస్తరణ!

విశాఖలో విప్రో కార్యాలయం



- విశాఖలో వెయ్యి సీట్లకు విస్తరించేందుకు ప్రణాళికలు
- సంస్థ ప్రతినిధులతో ప్రభుత్వం, ఏపిటా మంతనాలు
- ఈ ఏడాది చివరినాటికల్లా విస్తరించేందుకు విప్రో సుముఖం
- వీడీఐ, క్లౌడ్ ప్రాజెక్టుల కేంద్రంగా వైజాగ్ బ్రాంచ్

సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయంగా పేరొందిన ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు ఇప్పుడు మహా నగరాల నుంచి టైర్–2 సిటీల వైపు చూస్తున్నాయి. టెక్ మహీంద్ర, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్ మొదలైన ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. కోవిడ్ సమయంలో వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానానికి అలవాటు పడిన ఉద్యోగులు.. తిరిగి కార్యాలయాలకు వచ్చేందుకు ఆసక్తి చూపించని నేపథ్యంలో వారి వద్దకే వచ్చేందుకు ఐటీ సంస్థలు అవసరమైన చర్యలకు ఉపక్రమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమ వ్యయాల్ని తగ్గించుకునేందుకు సంస్థలన్నీ.. ద్వితీయ శ్రేణి నగరాలపై దృష్టిసారించాయి. ఇందులో భాగంగా విప్రో కూడా విశాఖలో కార్యకలాపాలు విస్తరించేందుకు ముందుకొచ్చింది.

దశల వారీగా వెయ్యి వరకూ...

సత్యం జంక్షన్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2006 మే నెలలో విప్రో క్యాంపస్‌కు ఏడెకరాల స్థలాన్ని కేటాయించారు. అనంతరం మూడున్నరేళ్ల తర్వాత విప్రో తన కార్యకలాపాల్ని ప్రారంభించింది. 750 మందితో ప్రారంభించాలని భావించినా.. తొలుత 300 మందితో ప్రస్థానం మొదలు పెట్టింది. తరువాత ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందించకపోవడంతో విస్తరించేందుకు సుముఖత చూపలేదు. కోవిడ్ సమయంలో క్రమంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించింది. పరిస్థితులు చక్కబడటంతో మళ్లీ కార్యకలాపాల జోరు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విప్రో ప్రతినిధులతో చర్చించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ(ఎపిటా) గ్రూప్ సీఈవో కిరణ్‌రెడ్డి విప్రో ప్రతినిధి శశికుమార్‌తో దఫ దఫాలుగా చర్చలు జరిపి విస్తరణకు ఆహ్వానించారు. ఐటాప్ ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు కూడా విప్రో సంస్థకు లేఖలు రాశారు. దీనిపై సుముఖత వ్యక్తం చేసిన విప్రో దశలవారీగా వెయ్యి సీట్లకు విస్తరించేందుకు సిద్ధమని ప్రకటించింది.

వీడీఐ, క్లౌడ్ ప్రోగ్రామ్‌లతో..

విశాఖలో విస్తరణకు విప్రో సరికొత్త ఆలోచనలతో ముందడుగు వేస్తోంది. గత క్యాంపస్‌లో కొంత భాగం ఇప్పటికే అద్దెకు ఇచ్చిన విప్రో.. ముందు భవనంలో సేవలు ప్రారంభించింది. ఈ భవనంలోని అన్ని ఫ్లోర్లలోనూ తమ సంస్థకు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఇందులో అద్దెకు ఇచ్చిన వారిని ఖాళీ చేయించారు. వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ని మార్చాలని నిర్ణయించింది. ఇప్పటికే వీడీఐ ప్రాజెక్టులతో కార్యకలాపాలు ప్రారంభించారు. వెయ్యి మందికి సరిపడా మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను దాదాపు 90 శాతం పూర్తి చేసింది.

మానవ వనరులను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం



సంస్థ సేవలను విశాఖలో విస్తరిస్తామని ప్రభుత్వంతో విప్రో స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరికల్లా వెయ్యి సీట్లకు పెంచుతామని చెప్పారు. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు విప్రో ప్రతినిధులు హామీ ఇవ్వడం శుభపరిణామం. వైజాగ్‌లో టాలెంట్, అప్‌స్కిల్లింగ్, అనుభవజ్ఞులైన నిపుణులను అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలియజేశాం. భవిష్యత్తులో ఏ క్లెయింట్ వచ్చినా.. ఇక్కడికే తీసుకురావాలని సూచించాం. దానికి కావల్సిన మానవ వనరుల్ని అందిస్తామని స్పష్టం చేశాం. దానికి విప్రో ప్రతినిధులు కూడా అంగీకరించారు. ప్రభుత్వం తరపు నుంచి పూర్తి సహకారంతో పాటు విప్రో ప్రాజెక్టులకు అవసరమైన రిక్రూట్‌మెంట్‌కు కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చాం.

– కిరణ్‌రెడ్డి, ఎపిటా గ్రూప్ సీఈవో

మరో అంతర్జాతీయ విమానం

- త్వరలో శ్రీలంక నుంచి విశాఖకు సర్వీసు
- పాలనా రాజధాని కానున్న తరుణంలో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ఆసక్తి
- ఇప్పటికే వైజాగ్–సింగపూర్‌ల మధ్య అంతర్జాతీయ విమాన సర్వీసు
- విశాఖ ఎయిర్‌పోర్టుకు పెరుగుతున్న విమానాలు



శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి మరో ఇంటర్నేషనల్ విమాన సర్వీసు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు ఒక అంతర్జాతీయ విమాన సర్వీసు నడుస్తోంది. త్వరలో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విశాఖకు విమాన సర్వీసును నడపనుంది. ఆరేళ్ల క్రితం అంటే 2017లో ఇదే ఎయిర్‌లైన్స్ కొలంబో– విశాఖపట్నంల మధ్య ఒక సర్వీసును ప్రారంభించింది. అప్పట్లో ఆశించినంతగా ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ఏడాదిన్నర తర్వాత ఈ సర్వీసును రద్దు చేసుకుంది. దీంతో అప్పట్నుంచి శ్రీలంకకు విమాన సర్వీసులు లేకుండా పోయాయి. ఆ తర్వాత కోవిడ్ ప్రభావం చూపింది. ఇన్నాళ్లూ ఎవరైనా ఈ ప్రాంతం నుంచి విమానంలో శ్రీలంక వెళ్లాలంటే హైదరాబాద్, చెన్నైలకు చేరుకుని అక్కడ నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇది ప్రయాణికులకు ఆర్థికంగా పెనుభారం అవుతోంది. ప్రయాణ సమయం కూడా ఎక్కువ తీసుకుంటోంది. విశాఖ–కొలంబోల మధ్య వాయుమార్గంలో 1,249 కిలోమీటర్ల దూరం ఉంది. డైరెక్ట్ ఫ్లైట్‌లో వెళ్లడానికి 2.30 గంటల సమయం పడుతుంది. అదే హైదరాబాద్, చెన్నైలు వెళ్లి, అక్కడ నుంచి శ్రీలంక/కొలంబో వెళ్లాలంటే 10–16 గంటలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన రాజధాని ఏర్పాటవుతుండడంతో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ మళ్లీ వైజాగ్‌పై దృష్టి సారించింది. విశాఖపట్నం–శ్రీలంకల మధ్య రాకపోకలు సాగించే వారి సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తోంది. శ్రీలంకలో బౌద్ధక్షేత్రాలు, హిందూ పురాణ పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలున్నాయి. వాటిని సందర్శించడానికి పర్యాటకులు ఆసక్తి చూపుతారు. కోవిడ్ కూడా పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టిన తరుణంలో పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖ నుంచి శ్రీలంకకు టూరిస్టుల సంఖ్య పెరుగుతుందని శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ భావిస్తోంది. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని త్వరలోనే కొలంబో–వైజాగ్‌ల మధ్య విమాన సర్వీసును నడపాలని నిర్ణయించినట్టు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)మేనేజర్ చింతక పెరేరా తాజాగా వెల్లడించారు.

పెరుగుతున్న విమాన సర్వీసులు

మరోవైపు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇటీవల కాలంలో విమాన సర్వీసులు క్రమంగా పెరుగుతున్నాయి. విశాఖ నుంచి హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, పోర్టుబ్లెయిర్‌లకు ఈనెల 13 నుంచి, 21 నుంచి కొత్త సర్వీసులు మొదలయ్యాయి. ఇంకా మార్చి 3వ తేదీ నుంచి హైదరాబాద్, బెంగళూరులకు కూడా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండడంతో అందుకనుగుణంగా ఆయా విమానయాన సంస్థలు తమ సర్వీసులను విస్తృతం చేస్తున్నాయి.

జీఐఎస్‌కు మిట్టల్, ముఖేష్ అంబానీ

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలి
- ప్రారంభోత్సవంలో లేజర్ షో, మా తెలుగుతల్లికి మల్లెపూదండ పాట
- కూచిపూడి నృత్యంతో రెండో రోజు సదస్సు ప్రారంభం
- జిల్లా స్థాయి సమీక్షలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

సాక్షి, విశాఖపట్నం : వచ్చే నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.గుమ్మళ్ల సృజన సూచించారు. జీఐఎస్–2023కు సంబంధించి ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ డా. మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో కలిసి ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ జీఐఎస్‌కు నవీన్ మిట్టల్, ముఖేష్ అంబానీ, తదితర ప్రముఖ వ్యాపారవేత్తలు, అంబాసిడర్లు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామికవేత్తలకు విమానాశ్రయంలో ఆహ్వానం పలకడంతోపాటు వారికి వాహనాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో ఏర్పాటు చేసిన సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై వేదికల వారీగా వివరించారు. ప్రారంభోత్సవంలో లేజర్‌షో, మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాటతో ప్రారంభమవుతుందని, రెండో రోజు సదస్సు కూచిపూడి నృత్యంతో మొదలవుతుందన్నారు. ఎంజీఎం గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వీటికి సంబంధించి ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అవసరమైన ఎంట్రీ పాస్‌లు తీసుకోవాలని సృజన సూచించారు. కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి సదస్సును విజయవంతం చేయాలని ఆదేశించారు. జీఐఎస్–2023కు నియమించిన నోడల్ అధికారులందరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సదస్సుకు సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని డైరెక్టర్ సృజనకు వివరించారు. ప్రతినిధులు బస చేసే హోటల్స్ వద్ద సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మెడికల్ టీమ్‌లు, అంబులెన్స్‌లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీహెచ్ రంగయ్య, టూరిజం ఆర్డీ శ్రీనివాస్ పాణి, డీఎల్‌డీవో పూర్ణిమా దేవి, పరిశ్రమల శాఖ అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సొగసు చూడతరమా..





బీచ్‌రోడ్డు : వచ్చే నెలలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు, జీ 20 సదస్సుకు నగరం ముస్తాబవుతోంది. సాగర తీరంలోని సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తీరం వెంబడి ఉన్న సాగరకన్యలు, పులులు, ఏనుగులు, డైనోసార్లు వంటి వాటికి రంగులు వేస్తూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఆర్కే బీచ్‌కు వస్తున్న సందర్శకులను ఇవి ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. అలాగే రోడ్డు మధ్యలోని డివైడర్ల మధ్య భాగంలో పచ్చదనం పరుచుకుంది. పువ్వుల మొక్కలు నాటుతూ తీరాన్ని అందంగా మార్చుతున్నారు.





పచ్చని చెట్లు తోడుగా..





ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. కార్మికులకు కఠినమైన కాలం ఇదే.. అయినా సరే పొట్టకూటి కోసం.. సూరీడుకు ఎదురెళ్తున్నారు. విశాఖలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్, జీ–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో పలు పర్యాటక ప్రాంతాల్లో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. కార్మికులు మండు టెండలో పనిచేయాల్సి పరిస్థితి. ఇటువంటి వారి కోసం వృక్షాలు రా రమ్మని ఆహ్వానిస్తున్నాయి. మధ్యాహ్నం వేళ కార్మికులంతా ఇలా చెట్టు నీడలో కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తున్నారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం


వీకెండ్ జోష్



విశాఖలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం కళకళలాడాయి. వీకెండ్ కావడంతో ఆర్కే బీచ్‌లో సందడి నెలకొంది. టీయూ 142, కురుసుర, వీఎంఆర్‌డీఏ పార్కులో పర్యాటకుల రద్దీ కనిపించింది. జీ–20 సదస్సు నేపథ్యంలో సాగరతీరాన్ని అందంగా ముస్తాబు చేశారు. వీటిని తిలకించడానికి నగరవాసులు క్యూ కట్టారు. వివిధ జంతువుల ఆకృతులకు రంగులు వేయడంతో పిల్లలు ఎంజాయ్ చేశారు. కుటుంబ సభ్యులతో జాలీగా గడిపారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





సాగర తీరంలో సంగీతయాత్ర

బీచ్‌రోడ్డు : ప్రజలకు మంచి సంగీతం అందించడమే లక్ష్యంగా నెదర్లాండ్ దేశానికి చెందిన ఇద్దరు మ్యూజిషియన్స్ మార్కస్ కోహోర్స్ట్, మార్గ ఫెర్నాండజ్ ప్రపంచ సంగీత యాత్రను చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం విశాఖ సాగర తీరంలో సంగీత ప్రదర్శన ఇచ్చారు. స్వయంగా రచించిన పాటలను ఆలపిస్తూ సందర్శకులను అలరించారు. భారతదేశంలో నెల రోజు పాటు తమ సంగీత యాత్రను నిర్వహించనున్నట్టు తెలిపారు.



సంగీత ప్రదర్శన ఇస్తున్న మార్కస్ కోహోర్స్ట్, మార్గ ఫెర్నాండజ్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన(పీఎంకేవీవై-4.0) ద్వారా ఉద్యోగ కల్పనలో భాగంగా కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న ఉచిత శిక్షణ–ఉపాధికి దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రిషన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫోర్ వీలర్ సర్వీస్, టెక్నీషియన్, ప్లంబర్ జనరల్, ఫీల్డ్–ఆర్ అండ్ ఏసీ వంటి మూడు నెలల కాల వ్యవధి కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం అవకాశాలు కల్పిస్తామన్నారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పాసై, 18 నుంచి 45 ఏళ్ల గల యువత అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9966861476, 9346258000 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు జీవీఎంసీ స్పందన

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు కోరారు.

ఇలా వేద్దామా.. ఎమ్మెల్సీ ఓటు

సాధారణ ఎన్నికల కంటే.. ఎమ్మెల్సీ ఎన్నికలు భిన్నంగా ఉంటాయి. మరీ ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు వేరు. ఎందుకంటే.. జనరల్ ఎలక్షన్లలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ఓట్లేస్తారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులకు మాత్రమే ఓటేసే అవకాశం ఉంటుంది. అయితే ఈ ఎన్నికల్లోనూ చెల్లని ఓట్లు అధికంగా ఉండటం ఒకింత ఆశ్చర్యానికి గురి చేసే అంశమే. ఈ చెల్లని ఓట్లు ఫలితాలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఈ సారి ఈ ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉండకుండా.. ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఎన్నికల అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

– సాక్షి, విశాఖపట్నం





- పట్టభద్రుల ఓటింగ్‌లోనూ అధికమవుతున్న చెల్లని ఓట్లు
- 2011 ఎన్నికల్లో 5,282 ఓట్లు, 2017లో 11,519 ఓట్ల తిరస్కరణ
- ప్రాధాన్యత నంబర్లు సరిగా వేయకపోవడమే కారణం
- ఈ ఓట్లతో ఫలితాలు సైతం తారుమారయ్యే ప్రమాదం
- ఈ సారి పోలింగ్ బూత్‌ల వద్ద గ్రాడ్యుయేట్లకు సూచనలు

సార్వత్రిక ఎన్నికల్లో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలంటే ఆయన పేరు ఎదురుగా ఉన్న గుర్తుపై ఓటేస్తే సరిపోతుంది. కానీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇందుకు పూర్తి భిన్నంగా పోలింగ్ ఉంటుంది. నచ్చిన అభ్యర్థి ఒక్కరికి ఓటేస్తే సరిపోదు.. తర్వాత ఎవరు, ఆ తర్వాత ఎవరు అనేది కూడా ఎంపిక చేసుకోవాలి. అప్పుడే ఓటు చెల్లుబాటు అవుతుంది. ఈ విషయంలో గ్రాడ్యుయేట్లు ఇప్పటికీ గందరగోళానికి గురవుతుంటారు. అందుకే పోలైన ఓట్లలో చెల్లని ఓట్ల సంఖ్య ప్రతి ఎన్నికకూ పెరుగుతూ వస్తోంది. 2011లో జరిగిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో 5,282 ఓట్లు తిరస్కరణకు గురవ్వగా.. 2017లో ఆ సంఖ్య ఏకంగా 11,519కు చేరుకుంది. చాలా మంది గ్రాడ్యుయేట్లు తమకు నచ్చిన అభ్యర్థికి మాత్రమే ఓటు వేసి.. మిగిలిన వారిని విస్మరించడం వల్ల జరగరాని నష్టం జరుగుతోంది.

'ప్రాధాన్యత'కీలకం

ఎమ్మెల్యే ఎన్నికలకు సంబంధించి నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారనుకుందాం. ఆ నియోజకవర్గంలో 50 వేల ఓట్లు ఉంటే ఒకరికి 20 వేలు, రెండో వ్యక్తికి 15 వేలు, మూడో వ్యక్తికి 10 వేలు, నాలుగో వ్యక్తికి 5 వేల ఓట్లు పోలైతే అందులో 20 వేల ఓట్లు వచ్చిన వారిని విజేతగా ప్రకటిస్తారు. కానీ ఆయన్ని 30 వేల మంది వ్యతిరేకిస్తున్నారన్న విషయాన్ని విస్మరిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం అలా జరగదు. ఓటేసిన వారి అభిప్రాయాలను పక్కాగా గణిస్తారు. దాన్నే ప్రాధాన్యత క్రమం ఎన్నిక అంటారు. అంటే ఇక్కడ ఓటు వేసే వారు మొదటి వ్యక్తికి ఓటు వేయవచ్చు. అతని తర్వాత సెకండ్ బెస్ట్ అనుకున్న వారికి..థర్డ్ బెస్ట్.. ఇలా ఎంత మంది పోటీ చేస్తే అంతమందికీ ఓటు వేసే అవకాశం ఉంటుంది. అంటే ఫలానా అభ్యర్థి ఎమ్మెల్సీ కావాలని అనుకుంటే ఆయనకు నంబర్‌వన్ ఓటు వేస్తారు. ఆ అభ్యర్థి కాకపోతే రెండో అభ్యర్థి ఎవరని భావిస్తారో ఆయనకు రెండో ఓటు వేస్తారు.

వాళ్లిద్దరూ కాకపోతే తర్వాత వ్యక్తికి మూడో ప్రాధాన్యత వేస్తారు. ఇదే ఈ పోలింగ్‌లో కీలకం. ప్రతీ ప్రాధాన్యతకూ సమాన విలువ ఉంటుంది. అంటే మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ మెజారిటీ రాకపోతే, అప్పుడు అతి తక్కువ ఓట్లు వచ్చిన ఒక్కో అభ్యర్థినీ తొలగిస్తారు.

నంబర్ కచ్చితంగా వేయాల్సిందే..

గ్రాడ్యుయేట్స్ తమకు నచ్చిన మొదటి అభ్యర్థికి మాత్రమే ఓటు వేసి వదిలేసినా ఆ ఓటు చెల్లుతుంది. కానీ కొందరు తొలి ప్రాధాన్యం ఎవరికీ ఇవ్వకుండా.. రెండో ప్రాధాన్యం నుంచి ఓటింగ్ వేస్తున్నారు. దీని వల్ల చాలా ఓట్లు చెల్లడం లేదు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ఓటేయవచ్చు. లేదా ఒకే అభ్యర్థికి ఓటేయవచ్చు. లేదా కొందరికి ఓటేయవచ్చు. కాకపోతే ఎవరికి ఫస్ట్, ఎవరికి సెకండ్, ఎవరికి థర్డ్ అన్నది నిర్ణయించుకుని, వారి పేర్లు ఎదురుగా ఆ నంబర్ వేయాలి.

అవగాహన కార్యక్రమాలు



ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో ఎంత మందికైనా ఓటువేసే అవకాశం ఓటర్లకు ఉంటుంది. ఓటర్లు ఇచ్చే ప్రాధాన్యత నంబరే గెలుపోటములను నిర్ణయిస్తుంది. సరైన అవగాహన లేకుండా ఓటుహక్కు వినియోగించుకుంటే ఒక్కోసారి అది చెల్లుబాటవ్వదు. ప్రాధాన్యతా క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేసే అవకాశం ఉండటంతో ఓటింగ్‌పై ముందుగానే అవగాహన కలిగి ఉండటం ఎంతైనా అవసరం. లేకపోతే ఓటు వృథా అయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాం. పోలింగ్ బూత్‌ల వద్ద కూడా ఓటర్లకు అవగాహన కల్పించేలా పోస్టర్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

– డా.మల్లికార్జున, జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఎలా వేస్తే ఓటు చెల్లుతుందంటే..

- అభ్యర్థులకు ఎదురుగా ఉన్న గడిలో నంబర్ వేయాలి. అటూ ఇటూ కాకుండా వేస్తే ఓటు చెల్లకుండా పోతుంది.
- ప్రాధాన్యత క్రమంగా 1, 2, 3.. ఇలా వరుసగా వేయాలి. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల పేర్లున్న వరుసలో కాకుండా.. మనకు నచ్చిన ప్రాధాన్యతలో వేయాలి. అంటే 1 వేసి 2 లేకుండా 3 వేయకూడదు. లేదా 1 వేయకుండా 2, 3 వేయకూడదు. అలా చేసినా ఆ ఓటు చెల్లదు.
- హిందూ అరబిక్ అంకెలు (1,2,3) లేదా రోమన్ అంకెలు లేదా తెలుగు అంకెలు వేయాలి. వన్ టూ త్రీ, ఒకటి రెండు మూడు అని రాయకూడదు. అప్పుడూ ఓటు చెల్లదు. అయితే ఏదో ఒక రకం అంకెలే వాడాలి కానీ ఒక్కోటీ ఒక్కో రకం కలిపి రాసినా ఓటు చెల్లదు.
- ఒకే వ్యక్తిపై రెండు ఓట్లు (1, 1 లేదా 1, 2) వేసినా చెల్లదు. ఒకే నంబర్‌ను ఇద్దరికి వేసినా చెల్లదు. టిక్ మార్కులు, వేలి ముద్రలు, సంతకాలు, ఇతర రాతలు చెల్లవు.
- ఎన్నికల సంఘం ఇచ్చిన స్కెచ్ పెన్ మాత్రమే వాడాలి. వేరే పెన్, పెన్సిల్‌తో ఓటు వేస్తే చెల్లదు.
- వీటన్నింటినీ పాటించని ఓట్లను చెల్లని ఓట్లుగా పరిగణిస్తున్నారు.

సినీ దర్శకుడు నక్కిన త్రినాథ్‌కు సత్కారం



దర్శకుడు నక్కిన త్రినాథరావును సత్కరిస్తున్న ప్రసన్నకుమార్, మళ్ల సురేంద్ర

తుమ్మపాల : పట్టణంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ తెలుగు చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాథరావును చలనచిత్ర నటులు ప్రసన్నకుమార్, టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవితేజ హీరోగా ధమాకా చిత్రం సూపర్ హిట్ అయ్యి ప్రేక్షకులను ఆకట్టుకుందని, త్వరలో మరోమంచి చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాలని కోరారు. శ్రీనూకాంబికా అమ్మవారి ఆశీస్సులతో మరెన్నో చిత్రాలు పెద్ద హీరోలతో చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లపు శ్రీనివాసరావు, నక్కిన సురేష్, భానుచంద్ర, జొన్నాడ సురేష్ పాల్గొన్నారు.

హీరో శ్రీకాంత్ సందడి

ఎస్.రాయవరం : ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ అడ్డురోడ్డు సమీపంలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి విచ్చేసి సందడి చేశారు. ఆయనను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఆయినతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ప్రేక్షకులను ఉత్సాహ పరుస్తూ శ్రీకాంత్ ప్రసంగించారు. భూమిని నమ్ముకున్న ఏ ఒక్కరూ మోసపోరని, భూమిని పవిత్రంగా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఉప్పలపాటి సుకుమార్‌వర్మ,స్థానికులు పాల్గొన్నారు.



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న హీరో శ్రీకాంత్

ఏయూ పరిశోధకుడికి 'యువ పురస్కారం'

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): ఏయూ తెలుగు విభాగం పరిశోధక విద్యార్థి ప్రవీణ్ కుమార్‌కు నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రధానమంత్రి యువ పురస్కారం లభించింది. గత ఏడాది నేషనల్ బుక్ ట్రస్ట్ దేశవ్యాప్తంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఈ మహోత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా పరిశోధనాత్మక వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ఆ పోటీల్లో ప్రవీణ్‌కుమార్ తన విస్తృత పరిశోధనల్లో భాగంగా ఆంధ్రాలో అజ్ఞాత స్వాతంత్ర వీరులు – వీర వనితలు పేరుతో వ్యాసాన్ని పంపించారు. ఆ వ్యాసంతో అతడు నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రధాని యువ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆ వ్యాసాలను పుస్తక రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆ పుస్తకాల ను విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అధి కారులు ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.



ప్రచురితమైన బుక్ చూపుతున్న ప్రవీణ్

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,180
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.51,500
వెండి(కిలో):	రూ.70,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.100
స్కిన్	: రూ.170
స్కిన్‌లెస్	: రూ.180

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	405.00
విజయనగరం	409.00
శ్రీకాకుళం	409.00

ఉత్తమ దర్శకుడిగా ఎదగడమే ధ్యేయం

వర్ధమాన సినీ దర్శకుడు, గాయకుడు వేగి అవినాష్



కశింకోట : ఉత్తమ దర్శకునిగా ఎదగడమే తన ధ్యేయమని వర్ధమాన సినీ డైరెక్టర్, సినీ నేపథ్య గాయకుడు వేగి అవినాష్ అన్నారు. ఆదివారం ఇక్కడ సాక్షితో మాట్లాడుతూ జిల్లాలోని కోటవురట్ల మండలం రాజుపేటకు చెందిన తాను డిగ్రీ చదివి 15 ఏళ్ల క్రితం సినీ రంగంలోకి ప్రవేశించానన్నారు. తెలుగు, తమిళ్, కన్నడ భాషల్లో సుమారు 400 పైబడి పాటలు పాడానన్నారు. తమిళ్‌లో ఎక్కువ పాటలు పాడానన్నారు. అల్లు అర్జున్ నటించిన ' పరుగు' సినిమాలో 'నమ్మదేమోగాని'..పాటకు మంచి గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఉత్తమ నేపథ్య గాయకునిగా ఈ పాటకు ఫిల్మ్ ఫేర్ పురస్కారం కూడా లభించిందన్నారు. తనకు నేపథ్య గానం కంటే దర్శకత్వం అంటే మక్కువ ఎక్కువని, దీంతో తమిళంలో 'నాన్ మగన్ అలీ' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరి మెలకువలు పొందానని వెల్లడించారు. దీంతో తొలిసారిగా నూతన నటీనటులతో తీసిన 'మనవూరి పాండవులు' సినిమాకు దర్శకత్వం చేసే అవకాశం వచ్చిందన్నారు. తన దర్శకత్వంలో మరో సినిమా తీయడానికి కథా చర్చలు జరుగుతున్నాయని, వివరాలు త్వరలో వెల్లడిస్తానని తెలిపారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు కేథరిన్ విద్యార్థులు



సంపంగి చరణ్‌తేజను అభినందిస్తున్న కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ రాయి



ట్రోఫీతో కొయ్య ప్రవీణ్ కుమార్ రెడ్డి

తగరపువలస: జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఇద్దరు భీమిలి కేథరిన్ విద్యార్థులు ఎంపికయ్యారు. మచిలీపట్నంలో జరుగుతున్న అండర్ – 14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీల్లో బ్యాంకు కాలనీకి చెందిన 8వ తరగతి విద్యార్థి సంపంగి చరణ్‌తేజ, అండర్ – 17 బాలుర ఎంపిక పోటీల్లో మూలకుద్దుకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి కొయ్య ప్రవీణ్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరిద్దరూ మే నెలలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనను న్నారు. వీరిలో చరణ్‌తేజకు కేథరిన్ విద్యాసంస్థల తరపున చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి క్రికెట్ కిట్ అందించారు. ఇద్దరు విద్యార్థులతోపాటు కోచ్, వ్యాయామ ఉపాధ్యాయుడు సాడె అనిల్‌కుమార్‌ను అభినందించారు.

జిల్లా జట్టుకు జాగృతి

విశాఖ స్పోర్ట్స్: జిల్లా అండర్ 19 చదరంగం జట్టు ఎంపిక పోటీల్లో జాగృతి ఆడిన మూడు రౌండ్లలో విజయం సాధించింది. అండర్–11 బాలురలో జయమోహన్, అర్జున్ ఐదేసి పాయింట్లు సాధించగా బాలికల్లో శ్రీవిద్యా, ముస్కాన్ మూడున్నరేసి పాయింట్లు సాధించారు. అండర్–18 బాలురలో ఆర్యన్, శ్రీవైభవ్ మూడున్నరేసి పాయింట్లు సాధించగా బాలికల్లో జాగృతి మూడు పాయింట్లతో, లక్ష్మిప్రియ రెండు పాయింట్లతో నిలిచారు. ఆయా కేటగిరిల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వీరంతా జిల్లా అండర్–11, 19 జట్లుగా స్టేట్ అంతర జిల్లాల టోర్నీలో పాల్గొనున్నారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ వేలీ స్కూల్‌లో ఈ పోటీలు జరిగాయి.

మళ్లీ పూసిన మామిడి!

- రైతుల్లో చిగురించిన ఆశలు
- తొలుత పొగమంచుకు పూత రాలడంతో దిగులు
- తాజా పూతతో 70 శాతం కాయలు నిలబడే అవకాశం
- జిల్లాలో 3,256 హెక్టార్లలో మామిడి తోటలు
- హెక్టారుకు 10 టన్నుల కాయలు దిగుబడికి చాన్స్



పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో రెండోసారి పూతతో ఉన్న మామిడి

సాక్షి, విశాఖపట్నం: మామిడి మరోసారి పూత వచ్చింది. తొలుత ఈ ఏడాది డిసెంబరు ఆరంభం నుంచే పూత మొదలైంది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. సాధారణంగా మామిడి ముందుగా పూస్తే మార్చి నాటికే కాయలు అందుబాటులోకి వచ్చి మంచి ధర లభిస్తుంది. ఇది రైతుకు లాభదాయకమవుతుంది. గత సంవత్సరం ముందస్తు పూతతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో కాపుకొచ్చిన మామిడి టన్ను రూ.లక్ష వరకు ధర పలికింది. ఈ ఏడాది ముందుగానే పూత పూసిందన్న రైతు ఆనందాన్ని పొగ మంచు రూపంలో ఆవిరి చేసింది. జనవరిలో కురిసిన పొగ మంచుకు మామిడి చెట్లకున్న పూత రాలిపోవడం మొదలైంది. ఈ పరిస్థితికి మామిడి రైతుల్లో ఆందోళన నెలకొంది. కానీ ఫిబ్రవరి మొదటి వారం నుంచి వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. మామిడి చెట్లకు సరికొత్తగా పూత పూయడం ఆరంభమైంది. ఇది రైతుల్లో కొత్త ఆశలు చిగురించేలా చేస్తోంది. సాధారణంగా శీతలంలో పూసిన పూత చలి ప్రభావంతో నిలబడుతుంది. కానీ ఉష్ణోగ్రతలు పెరిగే సమయంలో ఆలస్యంగా పూస్తే నిలదొక్కుకోవడం ఒకింత కష్టంగా మారుతుందని, అందువల్ల కొత్తగా పూసిన పూత నిలబడాలని మామిడి రైతాంగం కోరుకుంటోంది. ఇప్పటికే గడచిన మూడేళ్లుగా మామిడి రైతుకు కాలం కలిసి రావడం లేదు. కోవిడ్ ప్రభావంతో వరసగా రెండేళ్లు ఎగుమతులు నిలిచి పోయాయి. గత ఏడాది 35–40 శాతానికి మించి కాపు కాయలేదు. ఇలా మూడేళ్ల నుంచి మామిడి రైతు నష్టపోతూనే ఉన్నాడు. ఈ సంవత్సరం తొలుత పూత పుష్కలంగా పూసినా పొగ మంచు దెబ్బకు రాలిపోవడంతో దిగాలు పడ్డాడు. ఇప్పుడు మళ్లీ పూసిన పూతైనా నిలబడితే కాస్త నిలదొక్కుకుంటామన్న ఆశాభావంతో ఉన్నాడు.

3,256 హెక్టార్లలో మామిడి

విశాఖపట్నం జిల్లాలో 3,256 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. ప్రధానంగా బంగినపల్లి, తోతాపురి (కలెక్టర్), సువర్ణరేఖ, చెరుకు రసాలు, పణుకులు వంటి రకాలు పండుతాయి.

సగటున హెక్టారుకు 10 టన్నుల కాయలు దిగుబడినిస్తాయి. ఈ ఏడాది మామిడి పూత 70 శాతం వరకు నిలబడే అవకాశం ఉందని, గడచిన మూడు నాలుగేళ్లకంటే ఈ సంవత్సరం కాపు బాగుంటుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం తాజాగా పూసిన పూత ఏప్రిల్ ఆఖరు లేదా మే మొదటి వారం నాటికి కాయలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు.

పూత నిలబడితేనే మేలు



డిసెంబరులో మామిడి పూత పుష్కలంగా రావడంతో ఎంతో సంబరపడ్డాం. ఈ ఏడాది ముందుగానే కాపు వస్తుందని ఆశపడ్డాం. ఇంతలో పొగమంచు వచ్చి పూత, పిందెలను రాల్చేసింది. మళ్లీ మూడు వారాల క్రితం నుంచి పూత రావడం మొదలైంది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున పూత నిలవడం కొంత కష్టతరమవుతుంది. పూత నిలబడితేనే కాపు కాసి దిగుబడి బాగుంటుంది. కొత్తగా వచ్చిన పూతతో కాపు ఆలస్యమవుతుంది.

–వైదా గురునాథరావు, మామిడి రైతు, రెడ్డిపల్లి, పద్మనాభం మండలం.

ఆందోళన వద్దు



కొత్తగా వస్తున్న మామిడి పూతతో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇది చాలా వరకు నిలబడుతుంది. ప్రస్తుతం వాతావరణం కూడా ఇందుకు అనుకూలంగానే ఉంది. ఈ ఏడాది దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉంటుంది. తెగుళ్ల బెడద కూడా అంతగా ఉండకపోవచ్చు. ఒకవేళ మామిడికి తెగుళ్లు సోకితే నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలను రైతులకు ఎప్పటికప్పుడు అందజేస్తాం.

– మన్మథరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, విశాఖపట్నం